జైనూర్ దిగ్బంధం

- అడుగడుగునా తనిఖీలు
- వెయ్యిమంది పోలీసులతో బందోబస్తు
- 144సెక్షన్ అమలు, నిలిపివేసిన ఇంటర్నెట్ సేవలు
- జైనూరులోనే అదనపు డీజీ, ఐజీ
- ఇరువర్గాలతో వేర్వేరుగా సమావేశాలు



జైనూరు/ఆసిఫాబాద్/ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 5: జైనూరు మండలానికి చెందిన ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యాన్ని నిరసిస్తూ ఇరువర్గాల మధ్య జరిగిన ఆందోళనలతో జైనూరులో ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అప్రమత్తమైన పోలీసు యంత్రాంగం కట్టుదిట్టమైన భద్రతచర్యలను చేపట్టింది. జైనూరు మండల కేంద్రాన్ని పోలీసులు అధీనంలోకి తీసుకున్నారు. 144 సెక్షన్ అమలు చేస్తూ కర్ఫ్యూను ప్రకటించారు. రాష్ట్ర అదనపు డీజీ(లాఅండ్‌అర్డర్) మహేష్ భగవత్, ఐజీ చంద్రశేఖర్, జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే, జగిత్యాల, సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, అఖిల్ మహాజన్, గౌస్ ఆలం, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, బాలానగర్ డీసీపీ సురేష్‌కుమార్, వేయిమంది ప్రత్యేక పోలీసులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. జిల్లా కలెక్టర్ తోపాటు పోలీసు ఉన్నతాధికారులు ఇరు వర్గాల పెద్దలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి సంయమనం పాటించాలని కోరారు.

ఏజెన్సీలో టెన్షన్ టెన్షన్..

జైనూరులో జరిగిన విధ్వంసంతో ఏజెన్సీలో టెన్షన్, టెన్షన్ నెల కొంది. బుధవారం ఇరువర్గాల మధ్య జరిగిన ఆందోళనలో బాగంగా పెద్ద ఎత్తున ఆస్తినష్టం సంభవించినట్లు తెలుస్తోంది. ఏజెన్సీ మండలాల్లో భయాందోళనలు నెలకొన్నాయి. గతంలో కూడా జైనూరు కేంద్రాంగానే ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని పోలీసు ఉన్నతాధికారులను పంపించి ఇక్కడి పరిస్థితులను చక్కబెట్టె పనిలో పడింది. జైనూరు ఘటనను నిరసిస్తూ మిగతా ఏజెన్సీ మండలాలైన కెరమెరి, వాంకిడి, సిర్పూర్(యు), తిర్యాణి మండలాల్లో ఆదివాసులు బంద్‌కు పిలుపునిచ్చారు.

అడుగడుగునా తనిఖీలు..

జైనూరులో జరిగిన ఘటన నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమై అడుగడుగున పికెటింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతున్నారు. జైనూరు నుంచి ఇటు ఆసిఫాబాద్ అటు ఉట్నూరు వైపు ఎవరూ వెళ్లకుండా జైనూరు శివారు ప్రాంతంలో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేశారు. ఎవరు కూడా ఇళ్ల నుంచి బయటికి రాకుండా ఆంక్షలను విధించారు. 144సెక్షన్ విధించి ఇంటర్‌నేట్ సేవలను నిలిపి వేశారు. ఆర్టీసీబస్సులు ఈరూట్లలో నడవకపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఉట్నూరు, మహరాష్ట్ర మీదుగా వెళ్లాల్సి వచ్చింది. మీడియాను సైతం అనుమతించకుండా అడ్డుకున్నారు. కాగా ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవలక్ష్మి జైనూరుకు వెళుతున్న క్రమంలో కెరమెరి వద్ద పోలీసులు అడ్డుకొని అక్కడి నుంచి పోలీసుల ఎస్కార్ట్ మధ్య ఎమ్మెల్యే నివాసానికి చేరవేశారు. అలాగే ఎమ్మెల్యే బయటకు వెళ్లకుండా మహిళా పోలీసు సిబ్బందిని పహారాగా ఉంచారు.

పోలీసు ఉన్నతాధికారుల పర్యవేక్షణ..

జైనూరు ఘటనపై పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. రాష్ట్ర డీజీపీ జితేందర్ ఆదేశాల మేరకు రాష్ట్ర అదనపు డీజీ(లాఅండ్‌అర్డర్) మహేష్ ఎం భగవత్, ఐజీ చంద్రశేఖర్ ఇక్కడే మకాం వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తు న్నారు. జిల్లా పోలీసు ఉన్నతాధికారులతో పాటు జగిత్యాల, సిరిసిల్ల, ఆదిలాబాద్ జిల్లాల ఎస్పీలు అశోక్‌కుమార్, అఖిల్ మహాజన్, గౌస్ ఆలం, జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్, వేయిమంది ప్రత్యేక పోలీ సులతో పటిష్ఠ బందోబస్తు నిర్వహిస్తున్నారు. కలెక్టర్‌తో పాటు పోలీసు ఉన్నతాధికారులు ఇరువర్గాల పెద్దలతో వేర్వేరుగా సమావేశాలు నిర్వహించి సంయమనం పాటించాలని కోరారు. ఘటనలో జరిగిన ఆస్తినష్టం పై పూర్తి స్థాయి నివేదిక అందించేందుకు కాగజ్ నగర్ డీఎస్పీను ప్రత్యేక అధికారిగా నియమించారు.

నిలిచిపోయిన ఇంటర్నెట్..

కాగజ్‌నగర్/రెబ్బెన: జైనూరు ఘటన నేపథ్యంలో ప్రభుత్వం జిల్లాలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేసింది. దీంతో గురువారం రాత్రి నుంచి ఇంటర్నెట్ సేవలు స్తంభించటంతో ఒక్కసారిగా సమాచార వ్యవస్థ నిలిచిపోయింది. ఆన్‌లైన్‌సేవలు లేకపోవటంతో జీఎస్టీ సువిధా సెంటర్, ఆన్‌లైన్‌సెంటర్లు, మీ సేవాకేంద్రాలు మూసివేశారు. అలాగే బ్యాంకుల్లో కూడా లావాదేవీలు జరుగలేదు.

సిర్పూర్ ఎమ్మెల్యే గృహ నిర్బంధం

కాగజ్‌నగర్: సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబును పోలీసులు గురువారం హౌస్ అరెస్టు చేశారు. జైనూరులో జరిగిన హింసాత్మక ఘట నను పరిశీలించేందుకు వెళ్తారన్న ముందస్తు సమాచారం మేరకు పోలీసులు ఎమ్మెల్యే ఇంటిని చుట్టుముట్టారు. ఎమ్మెల్యేను బయటకు పోనివ్వకుండా పోలీసులు మోహరించారు.

రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

ఎమ్మెల్యే హరీష్‌బాబు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్: జైనూరు ఘటనలో బాధితురాలికి ప్రభుత్వం రూ.25లక్షల పరిహారం చెల్లించాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానికంగా ఆయన మాట్లాడారు. జైనూరులో తరుచూ వివాదాస్పద ఘటనలు జరుగుతున్నా కూడా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నట్టు తెలిపారు. ఈ ఘటనకు బాధ్యుడైన నిందితుడికి కఠిన శిక్షణ విధించాలని డిమాండు చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కొంగ సత్యనారాయణ, పట్టణ అధ్య క్షుడు సిందం శ్రీనివాస్, వీరభద్రచారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే పాల్వాయి హరీష్‌బాబు ఇంటి ముందు పోలీసుల బందోబస్తు



జైనూరు సరిహద్దులో పోలీసుల పహారా

ప్రజలు సంయమనం పాటించాలి

- అదనపు డీజీ(లాఅండ్ఆర్డర్) మహేష్ భగవత్



సమావేశంలో మాట్లాడుతున్న డీజీ మహేష్ భగవత్, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఆసిఫాబాద్, సెప్టెంబరు 5: జైనూరు మండలంలో జరిగిన ఘటనపై అందరూ సంయమనం పాటించాలని అదనపు డీజీ(లాఅండ్‌ఆర్డర్) మహేష్ భగవత్ అన్నారు. గురువారం ఐజీ చంద్రశేఖర్, జిల్లాకలెక్టర్ వెంకటేష్ దోత్రే, జగిత్యాల, సిరిసిల్ల, ఆదిలాబాద్‌జిల్లాల ఎస్పీలు అశోక్ కుమార్, అఖిల్‌మహాజన్, గౌస్‌ఆలం, జిల్లా అదనపుకలెక్టర్ దీపక్‌తివారి, బాలానగర్ డీసీపీ సురేష్ కుమార్‌తోకలిసి జైనూరు మండలప్రజాపరిషత్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో, ఉట్నూర్‌లోని కుమరంభీం కాంప్లెక్స్‌లో ఆదివాసీ మతపెద్దలతో వేర్వేరుగా జైనూరుఘటనపై సంయమనం పాటించాలని కోరుతూ సమావేశాలు నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు డీజీ(లాఅండ్‌ఆర్డర్) మహేష్ భగవత్ మాట్లాడుతూ ఆదివాసీమహిళపైదాడి జరగడం బాధాకరమన్నారు. ఆదివాసీ యువత, ప్రజలు, ముస్లిం సోదరులు ఈఘటనపై సంయమనం పాటించాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించకూడదని తెలిపారు. బాధితమహిళకు ప్రభుత్వం తరపున అండగా ఉంటామని, వైద్యచికిత్స ఖర్చులు ప్రభుత్వమే భరిస్తుందని, కుటుంబసభ్యులు సహకరించాలని తెలిపారు. ఈఘటనలో జరిగిన ఆస్తినష్టంపై పూర్తిస్థాయి నివేదిక అందించేందుకు కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించామని తెలిపారు. బాధితులకు నష్టపరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఘటన సంబంధించిన విషయంపై పెద్దమనుషుల సూచనలు, సలహాలు స్వీకరించి ప్రజాఉపయోగకర చర్యలు తీసుకుంటామన్నారు. ఆదివాసీలు, ముస్లింలు కలిసిమెలిసి ఉండాలని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా శాంతియుతంగా ఉండాలని అన్నివర్గాల ప్రజలు సహకరించాలని తెలిపారు. జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ బాధిత మహిళపై అత్యాచారయత్నం, హత్యాయత్నానికి పాల్పడిన సందర్భంలో తుడుందెబ్బతో సహా ఆదివాసీసంస్థలు బంద్‌కు పిలుపునివ్వగా బంద్‌ను నిర్వహించేందుకు రెండువర్గాలతో చర్చించామని తెలిపారు. అయితే ఒక్కసారిగా రెండువర్గాల మధ్య ఘర్షణ జరిగి ఆదివాసీలు ఇతరవర్గాల ఆస్తులపై దాడిచేయడంతో, వారు ప్రతీకారచర్యగా రాళ్లు రువ్వడం, ఆస్తుల నష్టం మొదలైన వాటికి దారి తీసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ తన బృందంతో మొదట స్పందించి పొరుగన ఉన్న ఆదిలాబాద్, మంచిర్యాల, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలు, టీజీఎస్పీ ప్లాటూన్ల నుంచి అదనపు బలగాలతో తన శాయశక్తుల ప్రయత్నించారన్నారు. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తెచ్చేందుకు మొత్తం వేయిమందికి పైగా పోలీసు లను, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ మోహరించారన్నారు. రాష్ట్ర డీజీపీ, ఏడీజీ, నార్త్‌జోన్ ఐజీ నిరంతరం పర్యవేక్షిస్తున్నారన్నారు. కర్ఫ్యూ ఆదేశాలు, 144సెక్షన్‌ను జారీ చేశామన్నారు. పుకార్లు తప్పుడు వార్తలు వ్యాప్తి చెందకుండా ఆయాప్రాంతాల్లో ఇంటర్నెట్‌పై నిషేదాన్ని అమలు చేశామన్నారు. ప్రజల్లో ఆత్మవిశ్వాసం నింపేందుకు పికెట్లు పెడుతున్నామన్నారు. అత్యాచారయత్నం, హత్యాయత్నం కేసులో ఇప్పటికే నిందితు లను జైనూరు పోలీసులు అరెస్టుచేసి రిమాండుకు తరలించినందున అందరూ సంయమనం పాటించాలని కోరారు. వదంతులను నమ్మవద్దని, రెచ్చగొట్టే సోషల్‌మీడియా పోస్టులను ప్రసారం చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అత్యవసర పరిస్థితి కోసం ప్రజలు డయల్ 100ని సంప్రదించవచ్చని తెలిపారు.

మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం విఫలం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 5: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు రక్షణ కల్పించడంలో పూర్తిగా విఫలమైందని ఎమ్మెల్యే కోవ లక్ష్మి విమర్శించారు. గురువారం ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకు మహిళలకు రక్షణ కరువైందన్నారు. జిల్లాలో కొన్నినెలల వ్యవధిలో మహిళలపై దాడులు జరుగుతున్నా రక్షణ కల్పించడంలో పోలీసులు విఫలమైనట్లు పేర్కొన్నారు. జైనూరులో బుధవారం జరిగిన ఘటనలో బాధితులను పరామర్శించేందుకు వెళుతున్న క్రమంలో ఆదివాసీ ఎమ్మెల్యే అని చూడకుండా పోలీసులు అడ్డుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా ప్రభుత్వం నిందితులపై చట్టపరమైన కఠినచర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకురాలు మర్సుకోల సరస్వతి పాల్గొన్నారు.

బెజ్జూరులో 144సెక్షన్

బెజ్జూరు, సెప్టెంబరు 5: జైనూరులో జరిగిన సంఘటన నేపథ్యంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు బెజ్జూరు మండలంలో 144సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై విక్రం తెలిపారు. ఎవరు కూడా గుంపులుగా ఉండరాదని, అనుమతి లేనిదే ర్యాలీలు, సభలు సమావేశాలు, సామాజిక మాధ్యమాల్లో పోస్టింగ్‌లు పెట్టరాదన్నారు.

తిర్యాణిలో సంపూర్ణ బంద్

తిర్యాణి/కెరమెరి, సెప్టెంబరు 5: తిర్యాణి, కెరమెరిలో గురువారం సంపూర్ణ బంద్ జరిగింది. జైనూరులో ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని డిమాండ్‌చేశారు. ఇలాంటి సంఘనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ, ఆదివాసీ సంఘాల నాయకులు కోట్నాక ప్రవీణ్, గుణవంతరావు, వెడ్మ భగవంతరావు,భాస్కర్,సుభాష్,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులు.. జాతి నిర్మాతలు: డీఈవో

- ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



ఉత్తమ ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న డీఈవో అశోక్

ఆసిఫాబాద్‌రూరల్, సెప్టెంబరు 5: ఉపాధ్యాయులు జాతి నిర్మాతలని జిల్లా విద్యాశాఖ అధికారి పార్శి అశోక్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో గురుపుజోత్సవాన్ని పురష్కరించుకొని ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల పురష్కరాల అందజేత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మారుతున్న సాంకేతికయుగంలో ఉపాధ్యాయుడు తనఉనికిని కాపాడుకోవడానికి అప్‌డేట్ కావాలన్నారు. తరగతి బోధనతో పాటు విద్యార్థులఉన్నతకు కృషిచేయాలన్నారు.ఈ సందర్భంగా జిల్లాలోని 55మంది ఉత్తమఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేసి ఘనంగా సన్మానించారు. అలాగే పద్మశాలి, లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయదినోత్సవాన్ని పురష్కరించుకొని పలువురు ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో డీడబ్ల్యువో భాస్కర్, ఎస్సీ సంక్షేమాధికారి సజీవన్, జిల్లా పరీక్షల సహాయ కమిషనర్ ఉదయ్‌బాబు, జిల్లా సైన్స్ అధికారి కటకంమధుకర్, ఆయాఉపాధ్యాయ సంఘాల నాయకులు శ్రీనివాస్, అడె ప్రకాష్, శాంతికుమారి, చరణ్‌దాస్, తుకారాం, వెంకటేశ్వర్లు, పద్మశాలి సంఘం నాయకులు అంజనేయులు, లయన్స్‌క్లబ్ సభ్యులు తారీక్, వేణు, శంకర్, రమణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్/రెబ్బెన: పట్టణంలో, రెబ్బెన మండలకేంద్రంలోని ప్రభుత్వపాఠశాల, గోలేటిటౌన్‌షిప్‌లోని సింగరేణి ఉన్నతపాఠశాలలో గురువారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించారు. అనంతరం ఆయా పాఠశాలల కరస్పాండెంట్‌లు మాట్లాడుతూ మాజీరాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకొని ఉపాధ్యాయదినోత్సం జరుపుకోవటం గర్వంగా ఉందన్నారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంఈవో వెంకటేశ్వర స్వామి, తిరుపతి బహుమతులను అందజేశారు. అలాగేపలుఅంగన్‌వాడీ కేంద్రాల్లోకూడా పిల్లలు ఉపాధ్యాయ వేషాధారణలో వచ్చారు.

బెజ్జూరు: మండలంలో ఉపాధ్యాయదినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని అన్నిప్రభుత్వప్రైవేటు పాఠశాలలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన నిర్వహించారు.

జైనూరు బాధితురాలికి న్యాయం చేయాలి

- బీజేపీ మహిళా మోర్చా సభ్యుల రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీజేపీ మహిళ మోర్చా సభ్యులు, బీజేపీ నాయకులు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 5: జైనూరులో గిరిజన మహిళపై జరిగిన అత్యాచార ఘటనపై వెంటనే న్యాయం చేయాలని కోరుతూ బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో గురువారం కాగజ్‌నగర్ లారీచౌరస్తాలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా మోర్చా అధ్యకురాలు శ్రీదేవి, పట్టణ మహిళా అధ్యక్షురాలు చిప్ప మౌనిక మాట్లాడుతూ జైనూరులో గిరిజన మహిళపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తిని ఉరి తీయాలన్నారు. శిక్ష పడేంతవరకు తమ పార్టీ ఆధ్వర్యంలో పోరాడుతామన్నారు. ఆరునెలల క్రితం జైనూరులో అల్లర్లు జరిగినప్పటికీ పోలీసు యంత్రాంగం ఎందుకు అప్రమత్తంగా లేదన్నారు. రాస్తారోకో చేయటంతో ఇరువైపులా ట్రాఫిక్ నిలిచిపోవటంతో సీఐ శంకరయ్య, ఎస్సై సుధాకర్ సంఘటన స్థలానికి చేరుకొని రాస్తారోకో విరమింపజేశారు. రాస్తారోకోలో బీజేపీ మహిళా మోర్చా జిల్లా జనరల్ సెక్రెటరీ పారిపెల్లి రాణి, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు ముత్తు అశోక్, ఓబీసీ మోర్చా జిల్లా వైస్ ప్రెసిడెంట్ మాచర్ల శ్రీనివాస్, వల్పాదాస్ రమేష్, వల్పాదాస్ ప్రణయ్, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యమాలను విజయవంతం చేయండి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 5: కార్మికహక్కుల కోసం తమ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉద్యమాలను విజయవంతం చేయాలని సింగరేణి కోల్ మైన్స్ కార్మికసంఘ్(బీఎంఎస్) అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య, ప్రధాన కార్యదర్శి యతిపతి సారంగపాణి అన్నారు. గురువారం ఆర్కే-5 గనిపై నిర్వహించిన గేట్‌మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. బొగ్గు పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికుల న్యాయమైన డిమాండ్ల కోసం సింగరేణి యాజమాన్యం తగినచర్యలు తీసుకోవాలన్నారు. యూనియన్ సభ్యత్వ ధ్రువీకరణ నమోదు పద్ధతి చెక్ఆఫ్‌సిస్టమ్, పారిశ్రామికసంబంధాల వ్యవస్థను కొనసాగించాలన్నారు. 11వవేజ్‌బోర్డులు ఆమోదించిన ఒప్పందాలను అమలు చేయాలన్నారు. మహిళాఉద్యోగుల సాధికారతకు కమిటీనిఏర్పాటు చేయాలన్నారు. సీపీఆర్ఎంఎస్‌లో భాగంగా స్మార్ట్‌కార్డులు అందించాలని, రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్‌ను సవరించాలని, పెంచిన బకాయిలను వెంటనే చెల్లించాలని, ఆదాయపు పన్ను రీయింబర్స్‌మెంట్ ఇప్పించాలని, కార్మికుల ఇంటి నిర్మాణానికి 2గుంటలస్థలం అందించాలని, సింగరేణికి విద్యుత్‌సంస్థల నుంచి రావాల్సిన 29వేల కోట్లుఇప్పించాలని కోరారు. కార్యక్రమంలో ఏరియా ఉపాధ్యక్షుడు నాతాడి శ్రీధర్ రెడ్డి, కేంద్ర ఉపాధ్యక్షుడు చాట్ల అశోక్, కార్యదర్శి రాగం రాజేందర్, నాయకులు రవీందర్, శ్రీకాంత్, మల్లేష్, సతీష్, రాజేందర్, విజయ్, మహేందర్, చంద్రశేఖర్, రమేష్, రామకృష్ణ పాల్గొన్నారు.

ఏరియా కార్మికుల క్రీడలకు సన్నాహాలు

మందమర్రి టౌన్, సెప్టెంబర్ 5: మందమర్రి ఏరియా కార్మిక వార్షికక్రీడలు ఈనెల8నుంచి నిర్వహించడానికి యాజమాన్యం సన్నాహాలు చేస్తోంది. కాగా ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఏరియాలోని సింగరేణి పాఠశాల మైదానం పూర్తిగా పాడయింది. ఎక్కడపడితే అక్కడ గుంతలతో పాటు నీరు నిలిచింది. దీన్ని పూర్తిగా మరమ్మత్తు చేసేందుకు యాజమాన్యం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. ఏదిఏమైనా కొద్ది రోజులుగా వాకింగ్ ట్రాక్ కూడా చెడిపోవడంతో వాకర్లు ఇబ్బందులు పడుతున్నారు. ఏరియా క్రీడలతో మైదానానికి మంచి రోజులు వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

చేస్తున్న పనులతోనే యూనియన్‌లో చేరికలు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 5: తమ యూనియన్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తున్నందున కార్మికులు ఆకర్షితులై యూనియన్‌లో చేరుతున్నారని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ తెలిపారు. గురువారం ఏరియాలోని కేకే5 గని, ఇతరగనుల కార్మికులు ఏఐటీయూసీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు గాండ్ల సంపత్, సోంశెట్టి రాజేశం తదితరులు పాల్గొన్నారు.



పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత: సీఎండీ

శ్రీరాంపూర్, సెప్టెంబరు 5: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని సింగరేణి సీఎండీ ఎన్ బలరామ్ పేర్కొన్నారు. గురువారం ఆయన సింగరేణి భవన్‌లో మట్టి గణపతి ప్రతిమలను ఉద్యోగులకు ఉచితంగా అందించారు. అనంతరం మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో భవిష్యత్‌తరాలకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందుతున్నారు. తమసంస్థ ఆధ్వర్యంలో అన్ని ఏరియాల్లో మట్టి గణపతి విగ్రహాలు ఇస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది కూడా అదే సంప్రదాయాన్ని కొనసాగిస్తామని తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జీఎం(కో-ఆర్డినేషన్) సుభాని, చీఫ్ ఆఫ్ పవర్ విశ్వనాథరాజు, వివిధ విభాగాల అధిపతులు, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



గణేష్ ప్రతిమను అందిస్తున్న సీఎండీ బలరాం

కొమురయ్య సేవలు చిరస్మరణీయం



శ్రీరాంపూర్: నివాళులు అర్పిస్తున్న నాయకులు



జైపూర్: కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేస్తున్న నాయకులు

మందమర్రిటౌన్, సెప్టెంబరు 5: కార్మికులకు దివంగత నాయకుడు మనుబోతుల కొమురయ్య చేసిన సేవలు చిరస్మరణీయమని ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ, ఏరియాకార్యదర్శి భీమనాథుని సుదర్శన్ తెలిపారు. గురువారం ఏరియాలోని కేకే5గని, వర్కుషాప్, స్టోర్స్, సివిల్ డిపార్టుమెంట్, కేకేఓసీపీల్లో కొమురయ్య వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ యాజమాన్యం విధానాలను ఎండగడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం కొమురయ్య ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు బండి శ్రీనివాస్, సోంశెట్టి రాజేశం, గాండ్ల సంపత్, దేవసాని సాంబయ్య, సమ్మయ్య, వెంకటేశ్వర్లు, రాజేశ్వర్‌రావు, అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్: ఎన్నో కార్మికుల హక్కులను సాధించిన మహానాయకుడు మనుబోతుల కొమురయ్య అని ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కె సమ్మయ్య, బ్రాంచ్‌కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా అన్నారు. కొమురయ్య 28వ వర్ధంతిని శ్రీరాంపూర్‌లోని అన్నిగనులు, విభాగాలలో గురువారం నిర్వహించారు. అనంతరం నర్సయ్య భవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్‌రావు, సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య, ఆర్గనైజింగ్ కార్యదర్శి సంపత్, మైనింగ్ స్టాఫ్ కార్యదర్శి మారపల్లి బాబు, కాంట్రాక్ట్ వర్కర్స్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, గునిగంటి నర్సింగరావు, పిట్ కార్యదర్శులు పాల్గొన్నారు.

కాసిపేట: కాసిపేట1,2గనులపై గురువారం కార్మికనేత మనుబోతుల కొమురయ్య 28వ వర్ధంతిని ఏఐటీయూసీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీబెల్లంపల్లి బ్రాంచ్ కార్యదర్శి దాగంమల్లేష్, నాయకులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, రాజేందర్, కొమురయ్య, లింగమూర్తి, సుభాష్‌చంద్రబోస్ పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని ఐకే1ఏ, ఓసీపీపై గురువారం పిట్‌కార్యదర్శి చింతల నవీన్‌రెడ్డి, బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా కొమురయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణం, శ్రీకాంత్, అఫ్రోజ్‌ఖాన్, బాలకృష్ణ, రాజయ్య, సత్తయ్య,వెంకటస్వామి, సురేష్ బాబు, శ్రీకాంత్, వెంకటేష్, విజేందర్, రమేష్, కేశవ్, నరేష్,హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

'కాంట్రాక్టు కార్మికులను వేధించడం మానుకోవాలి'

శ్రీరాంపూర్, సెప్టెంబరు 5: శ్రీరాంపూర్ ఓసీపీ సీఆర్ఆర్ కంపెనీలో బ్లాస్టింగ్ పనులు చేస్తున్న కాంట్రాక్టు కార్మికులను వేధించడం మానుకోవాలని కాంట్రాక్ట్‌వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఓసీపీలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బ్లాస్టింగ్ కార్మికులకు ప్రతినెల26 మస్టర్లు ఇవ్వకుండా వేధింపులకు గురిచేయడం తగదన్నారు. నాలుగురోజులుగా సమస్య పరిష్కరించాలని కోరుతున్నా సీఆర్ఆర్ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందన్నారు. ఈనెల3న ఓసీపీ పీవోకు వినతిపత్రంఇచ్చి ఫోన్‌ద్వారా మాట్లాడించగా, సరేనన్న మేనేజర్ గురువారం డ్యూటీకివెళ్తే 23మస్టర్లు మాత్రమే ఇస్తామని కార్మికులను బెదిరించడం తగదన్నారు. బ్లాస్టింగ్ కార్మికులతో ఇతరపనులు చేయించవద్దని, 26మస్టర్లుతప్పనిసరిగా ఇవ్వాలని, ఈవిషయంలో సింగరేణి అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

మందమర్రిలో ఇంటింటా జ్వరాలే

- జ్వరాల సర్వే చేయని సిబ్బంది
- పారిశుధ్య లోపంతో వ్యాధుల విజృంభణ

మందమర్రిటౌన్, సెప్టెంబరు 5: పట్టణంలోని ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. ఇంట్లో జ్వరం లేని వారు లేరంటే అతిశయోక్తి కాదు. కుటుంబాలకు కుటుంబాలే జ్వరాలతో బాధపడుతూ అందుబాటులో ఉన్న ఆసుపత్రులకు వెళ్లడంతో పాటు ఆర్ఎంపీల వద్దకు క్యూ కడుతున్నారు. పట్టణంలో రెండు అర్బన్ హెల్త్ సెంటర్లు, ప్రభుత్వ ఆసుపత్రి ఉన్నా జ్వరాలతో బాధపడుతున్న కాలనీల్లో జ్వర సర్వే చేయడం లేదని ప్రజలు వాపోతున్నారు. చిన్నారుల నుంచి వృద్ధుల వరకు జ్వరం, నొప్పులతో బాధపడుతున్నారు. వైద్య సిబ్బంది కాలనీల్లో శిబిరాలను ఏర్పాటు చేయాలని, జ్వర సర్వే నిర్వహించి జ్వర పీడితులను గుర్తించి చికిత్సలు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

-మందమర్రి మున్సిపాలిటీలో సిబ్బంది కొరత

మందమర్రి మున్సిపాలిటీలో సిబ్బంది కొరత ప్రజలకు శాపంగా మారింది. మున్సిపాలిటీలో రెగ్యులర్, కాంట్రాక్టు కార్మికులు 60 మంది పనిచేస్తున్నారు. మున్సిపాలిటీలో 24 వార్డులుండగా 53 వేలకు పైగా జనాభా ఉన్నారు. కొన్ని వార్డుల్లో పారిశుధ్య పనులు పడకేశాయి. వారం రోజులుగా వర్షాలు పడడం, పారిశుధ్యం లోపించడంతో దోమలు వృద్ధి చెంది రోగాలు వ్యాపిస్తున్నాయి. అన్ని వార్డుల్లో ఫాగింగ్, దోమల మందు పిచికారి, డ్రైనేజీల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని వార్డుల ప్రజలు పేర్కొన్నారు.

పంట నష్టం అంచనా


పంట నష్టాన్ని అంచనా వేస్తున్న ఏవో సంగీత

జన్నారం, సెప్టెంబరు 5 : వర్షాలకు పంట పొలాల్లోకి నీరు చేరడంతో రైతులు నష్టపోయారు. గురువారం మండల వ్యవసాయాధికారి సంగీత పంట నష్టం అంచనా వేశారు. నీట మునిగిన పొలాల వద్దకువెళ్లి పరిశీలించారు. ఇందన్‌పల్లి, కామన్‌పల్లి, కొత్తపేట, కవ్వాల (ఆర్ఎఫ్), మురిమడుగు, కలమడుగు గ్రామాల్లో పంటల సర్వే చేశా రు. మొత్తం 290 ఎకరాల్లో పంట నష్టపోయినట్లు తెలిపారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

లైసెన్స్‌లు కలిగి ఉండాలి

ఫెర్టిలైజర్ దుకాణాలకు తప్పనిసరిగా లైసెన్స్ ఉండాలని ఏవో సంగీత తెలిపారు. ఆమె మాట్లాడుతూ దుకాణాల్లో ఎరువులు, విత్తనాలకు సంబంధించిన ధరల పట్టికను ప్రదర్శించాలని సూచించారు. లైసెన్స్‌లు లేకపోతే షాపులను సీజ్ చేస్తామని హెచ్చరించారు.

వేమనపల్లి: ముల్కలపేట, రాచర్ల గ్రామాల శివా రులోని పంట పొలాలను భీమిని డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు సురేఖ పరిశీలించారు. వర్షాలకు ప్రాణహిత నది పోటెత్తడంతో పంటలకు ఏమైనా నష్టం జరిగిందా అని పరిశీలన చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రైతులు ఆమెను కలిసి జూలై లో కురిసిన వర్షాలకు వందల ఎకరాల్లో పం టలు నీట మునిగి నష్టపోయామని నష్టపరిహా రం అందించాలని కోరారు. స్పందించిన ఏడీఏ నివేదికలను ఉన్నతాదికారులకు పంపించామన్నారు. ఏవో వీరన్న, ఏఈవోలు రుక్సార్ సుల్తానా, హెప్సిబా పాల్గొన్నారు.

అటెండర్‌కు సన్మానం



దండేపల్లి,సెప్టెంబరు 5: గుడిరేవు ప్రాథమిక పాఠశాలో అటెండర్‌గా పని చేసి పదవీ విరమణ పొందిన పుట్టపాక నారయణను గురువారం పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. రాష్ట్ర గిరిజన కార్పొరేషన్ ఛైర్మన్ కోట్నాక తిరుపతి హాజరై మాట్లాడుతూ సమాజంలో మంచి సేవలు అందించినపుడు తగ్గిన గుర్తింపు వస్తుంద న్నారు. పూర్వ విద్యార్థులు రూ. 40వేలు సమీకరించి ఆయనకు అందజేశారు.

సన్మానం



మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 5: ప్రొఫెసర్ జయ శంకర్ తెలంగాణ విశ్వ విద్యాలయం 10వ ఆవిర్భావ వేడు కల సందర్భంగా ఉత్తమ రైతు పురస్కారం అందుకున్న గోనె శ్యాంసుందర్‌రావును గురువారం జిల్లా జేఏసీ నాయ కులు సన్మానించారు. రైతుల సంక్షేమానికి ఆయన చేస్తు న్న సేవలను కొనియాడారు. జయరావు, శ్రీనివాస్, చరణ్‌దాస్, శ్రీనివాస్‌ప్రకాష్ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తూ.. ప్రాణాలు కాపాడుతూ..

- ఆపత్కాలంలో ఆపన్నహస్తం
- రక్తదానానికి చిరునామా డైలీ క్రికెట్ యూత్ సభ్యులు



రక్తదానం చేస్తున్న పవన్‌సాయి, ఎంగలి రాకేష్

వాంకిడి, సెప్టెంబరు 5: అత్యవసర సమయాల్లో రక్తం అందక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతుండడం మనం నిత్యం చూస్తునే ఉన్నాం. అలాంటిది రక్తదానం చేస్తూ, చేయిస్తూ ప్రాంతాలతో సంబంధం లేకుండా ఆపత్కాలంలో ఆపన్నహస్తం అందిస్తూ బాధితులకు అండగా నిలిచి ప్రాణాలు కాపాడుతున్నారు వాంకిడి డైలీక్రికెట్ యూత్ సభ్యులు. నాలుగు సంవత్సరాలుగా జిల్లాతోపాటు సమీప మంచిర్యాలజిల్లాకు వెళ్లి బాధితులకు రక్తదానం చేసి ప్రాణాలు కాపాడి ఔరా అనిపిస్తున్నారు.

సామాజిక మాధ్యమాలే వేదికగా..

వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో గ్రూపులు ఏర్పాటు చేశారు. ఇందులో ఉన్న ఏ సభ్యుడైనా ఏదైనా ఆసుపత్రిలో రక్తంకోసం ఎదురుచేస్తున్న బాధితుల కోసం సందేశంవస్తే చాలు ఆ సందేశాన్ని చదివి గ్రూపులోని సభ్యులు ఆ ప్రాంతానికి చేరి దగ్గర్లో ఉన్న ఆసుపత్రులకు వెళ్లి బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఈ డైలీ క్రికెట్ యుత్ సభ్యులు అంతా అరుదైన కర్త గ్రూపులు ఉన్న వారు కావడం గమనార్హం. ఇప్పటివరకు సుమారుగా 300మందికి పైగా రక్తదానం చేసి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఈ యూత్ సభ్యుల్లో ఎంగలి రాకేష్ చురుకుగా వ్యవహరిస్తుంటారు. గ్రూపుసభ్యుల్లో పవన్ సాయి- 27సార్లు, ఎంగలి రాకేష్-13సార్లు, పాగిడే సాయి- 8 సార్లు, బండె తుకారాం, -7 సార్లు, సోను -6 సార్లు, జంజీరాల సంతోష్- 4 సార్లు పిప్పరినవీన్-4సార్లు, మద్దికుంట సాయి కృష్ణ- 6 సార్లు, ఇలా అనేక మంది డైలీ క్రికెట్ యూత్ సభ్యులు 5నుంచి 10సార్లు రక్తదానం చేసి పలువురి ప్రాణాలు కాపాడారు.

● ప్రాణాలు కాపాడాలని - పవన్‌సాయి

అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడాలని ముందుకు సాగుతున్నాను. వాట్సప్ గ్రూపుల్లో ఎవరికైనా రక్తం అవసరం ఉందని తెలియగానే వెంటనే అక్కడికి వెళ్లి రక్తదానం చేస్తున్నాను. నేను ఇప్పటివరకు 27సార్లు రక్తం ఇచ్చాను. అత్యవర పరిస్థితుల్లో ఎవరికైనా రక్తం అవసరం ఉంటే ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను.


రక్తదానం చేస్తున్న బండె తుకారాం

● ఏ సమయంలోనైనా రక్తం ఇవ్వడానికి సిద్ధం.. - ఎంగలి రాకేష్ సభ్యుడు

అత్యవసర సమయంలో ఆసుపత్రుల్లో ఎవరికైనా రక్తం అవసరం ఉందని వాట్సాప్‌లో సందేశం రాగానే తక్షణమే రక్తం ఇవ్వడానికి బాధితుల వద్దకు చేరుకుంటా. ఒకవేళ తన రక్తం గ్రూపు బాధితులకు సరిపోకపోతే డైలి క్రికెట్ సభ్యులను పిలిపించి బాధితులకు రక్తం అందిస్తాం. నేను ఇప్పటివరకు 13సార్లు రక్తం ఇచ్చాను.

- బాదితులకు అండగా నిలవడం ఆనందంగా ఉంటుంది. బండె తుకారం

బాదితులకు అండగా నిలవడం ఆనందంగా ఉంది. ఇప్పటివరకు 7సార్లు రక్తందానం చేశాను. అత్యవస సమయంలో రక్తం చేసిన తరువాత ఆసుపత్రి నుంచి బాధితులు ఆరోగ్యంగా ఇంటికి వెళ్తంటే సంతోషంగా ఉంటుంది. అత్యవసర సమయంలో ఎవరికైనా రక్తం అవసరం ఉంటే వెంటనే రక్తం ఇవ్వడానికి అందుబాటులో ఉండి బాధితులకు అండగా నిలుస్తాను.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

హాజీపూర్, సెప్టెంబరు 5: దొనబండ గ్రామానికి చెందిన మోతె సుధాకర్(48) చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందాడు. సుధాకర్ బుధవారం ఉదయం ప్రమాదవశాత్తు కాలు జారి మెట్లమీద నుంచి పడడంతో తలకు తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబీకులు మంచిర్యాలలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రవీందర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

చెరువులో పడి యువకుడి..


శ్రావణ్‌కుమార్ (ఫైల్)

కోటపల్లి, సెప్టెంబరు 5: కొత్తపల్లి గ్రామంలో గురువారం ప్రమాదవశాత్తు చెరువులో పడి తలండి శ్రావణ్‌కుమార్ (30) అనే యువకుడు మృతి చెందాడు. శ్రావణ్‌కుమార్ బంధువు సంవత్సరీకం నేపథ్యంలో కుటుంబ సభ్యులతో కలిసి చెరువులో స్నానానికి వెళ్ళగా ప్రమాదవశాత్తు కాలు జారి నీటిలో మునిగాడు. సమీపంలో ఉన్న వారు ఎంత వెతికినా జాడ లభించలేదు. కొంత సేపటికి మృతదేహం నీటిపైకి తేలింది. మృతుడి తండ్రి సమ్మయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాజేందర్ పేర్కొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు శిక్ష

జైపూర్, సెప్టెంబరు 5: పెద్దపల్లి జిల్లా మంథని మండలానికి చెందిన మెరుగు వెంకటేష్ గురువారం వాహనాలు తనిఖీ చేస్తుండగా మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడు. చెన్నూరు మేజిస్ట్రేట్ ఎదుట హాజరు పర్చగా ఏడు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్ఐ శ్రీధర్ తెలిపారు. మద్యం మత్తులో ఎవరైనా వాహనాలు నడిపితే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు.

అనారోగ్యంతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

కోటపల్లి, సెప్టెంబరు 5: శెట్‌పల్లి అంగన్‌వాడీ కార్యకర్త కొట్టె రాజమణి (50) అనారోగ్యంతో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. కొంత కాలంగా పేగు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా హైద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందినట్లు కుటుంబీకులు తెలిపారు. మృతురాలుకు భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బైక్ దొంగల అరెస్టు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 5 : వాహనాలు తనిఖీలు చేస్తుండగా ఇద్దరు బైక్ దొంగలను పట్టుకున్నట్లు సీఐ బన్సీలాల్ తెలిపారు. ఐబీ చౌరస్తాలో గురువారం వాహనాలు తనిఖీలు చేస్తుండగా నిమ్మల కుమార్, నెల్లి సాయికుమార్‌ల వద్ద వాహనాలు పత్రాలు లేవు. దీంతో వారిని విచారించగా బైక్‌లను దొంగతనం చేసినట్లు ఒప్పుకున్నారన్నారు. లక్షెట్టిపేట, కాసిపేటలో బైక్‌లను దొంగిలించి గురువారం అమ్మేందుకు వెళ్తున్నామని తెలిపారు. చున్నంబట్టి వాడలోని వారి ఇంట్లో మరో రెండు బైక్‌లతోపాటు మొత్తం 6 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ఎస్ఐలు సనత్, సురేష్, కానిస్టేబుల్లు సుబ్బారావు, శ్రీనివాస్,రమేష్ పాల్గొన్నారు.

సంచార గ్రంథాలయంలో పుస్తక ప్రదర్శన

దండేపల్లి,సెప్టెంబరు 5: ప్రజల్లో పుస్తక పఠనం ప్రాముఖ్యత తెలియజేసేందుకు రూమ్ టూ రీడ్ స్వచ్ఛంద సంస్థ మండల కేంద్రంలో గురువారం సంచార గ్రంథాలయం ద్వారా మొబైల్ రీడింగ్ లైబ్రరీ ఏర్పాటు చేశారు. సంచార లైబ్రరీ వాహనం ద్వారా పుస్తక ప్రదర్శన ఇస్తున్నామని రూమ్ టూరీడ్ ఎల్ఎఫ్‌మహేష్ పేర్కొన్నారు. సీఆర్పీ గరిగ నర్సయ్య పాల్గొన్నారు.


మొబైల్ సంచార లైబ్రరీ వద్ద యువకులు

మట్టి వినాయకులనే పూజిద్దాం..

- ● రేపు వినాయక చవితి
- ● విఘ్నేశ్వరుడి ఉత్సవాలకు ఏర్పాట్లు
- ● విభిన్న రూపాల్లో స్వామివారి ప్రతిమలు

నస్పూర్, సెప్టెంబరు 5: వినాయక నవరాత్రోత్సవాలకు మండపాలు ముస్తాబవుతున్నాయి. శనివారం వినాయక చవితి పండుగను ప్రజలు జరుపుకోనున్నారు. పట్టణం నుంచి పల్లెల వరకు నవరాత్రి ఉత్సవాలకు గణపతి మండపాల ఏర్పాటు పనులు మొదలయ్యాయి. మట్టి విగ్రహాలను పూజించాలని స్వచ్ఛంద సంస్థలు, పర్యావరణ వేత్తలు విస్తృత ప్రచారం చేస్తున్నాయి. పీవోపీతో తయారు చేసే విగ్రహాల్లో వినియోగిస్తున్న కృత్రిమ రంగులతో పర్యావరణానికి హాని కలగనుంది. పలు చోట్ల మట్టి విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నాయి. మండపాల విద్యుత్ అలంకరణలు, భజనలు, పూజలు, అన్నదానాలు నవరాత్రుల కోలాహలం శనివారం నుంచి మొదలు కానుంది. విభిన్న రూపాల్లో ఉన్న గణపతి ప్రతిమలను తొమ్మిది రోజులపాటు వేడుకలను నిర్వహించనున్నారు.

గణనాధుడి రూపాలు...

భాద్రపద మాసం వర్షాకాలంలో ఏటూ చూసిన పచ్చదనంతో ప్రకృతి శోభయామానంగా కనిపిస్తుంది. ఆది దేవతల్లో తొలి పూజలందుకునే గౌరీసుతుడి రూపం వ్యక్తిత్వ వికాసానికి ఓపాఠం. ఆయనకు చేసే పూజలు జీవ వైవిద్యానికే ప్రతీకగా నిలుస్తాయి. వాడవాడల గణపతి ఉత్సవాల సంబరాల సందడి నెలకొంటుంది. పట్టణం నుంచి ఊరువాడ వరకు భక్తి పారవశ్యం నిండుకుని ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుంది. వినాయకుడిని అరాధించడమంటేనే ప్రకృతిని పూజించడమని భావిస్తారు. పూజలో వినియోగించే మట్టి నుంచి పసుపు, ఆకులు అణువణువునా ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి. ప్రకృతిలో లభించే 21 రకాల పత్రిలో ఎన్నో ఔషధ గుణాలున్నాయి.

మార్కెట్లో విగ్రహాల కొరత...

గతేడాది కంటే ఈ సీజన్‌లో విగ్రహాల కొరత ఏర్పడింది. జిల్లాకు సరిపడే విగ్రహాలు అందుబాటులో లేవని పలువురు వ్యాపారులు తెలిపారు. మంచిర్యాల మార్కెట్‌లో 5 నుంచి 12 ఫీట్ల ఎత్తు కలిగిన 20 రకాల విగ్రహాల అమ్మకాలు జరిగాయి. గత ఏడాది కంటే ప్రస్తుతం డిమాండ్‌కు తగిన విధంగా విగ్రహాలు లేకపోవడంతో నిర్వాహకులు ఇతర ప్రాంతాలకు వెళుతున్నారు. విగ్రహాల ధరలు 5వేల నుంచి 40వేల వరకు ఉండగా గత సంవత్సరం కంటే 30 శాతం ధరలు పెరిగాయి.

విద్యుత్ అనుమతులు...

గణపతి మండపాలకు రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్‌ను ఉచితంగా ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇందులో భాగంగా ప్రతి మండపం నిర్వాహకులు కచ్చితంగా విద్యుత్ శాఖ అనుమతిని పొందాల్సి ఉంటుంది.

పోలీసుల శాఖ సూచనలు..

- మండపాల నిర్వహకులు అనుమతులు తీసుకోవాలి.



వినాయక మండపాల కోసం అనుమతులు తీసుకోవాలి

మందమర్రిటౌన్: వినాయక మండపాలను ఏర్పాటు చేసే వారు తప్పనిసరిగా పోలీసుల అనుమతులు తీసుకోవాలని ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. గురువారం పోలీస్‌స్టేషన్‌లో వినాయక ఉత్సవ కమిటీ నాయకులతో సమావేశం నిర్వహించారు. మండపాల నిర్వాహకులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అనుమతులు తీసుకోకుండా మండపాలను ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

- ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా మండపాలను ఏర్పాటు చేయాలి.
- అగ్ని ప్రమాదాలు తలెత్తకుండా నిర్వహకులు జాగ్రత్తలు పాటించాలి.
- విద్యుత్ ప్రమాదాలు జరుగకుండా ఏర్పాట్లు చేయాలి.
- రాత్రి 10 గంటల నుంచి డీజే సౌండ్, స్పీకర్లను వినియోగించరాదు.
- మండపాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలి.
- మండపాల వద్ద డీజేలకు అనుమతి లేదు.
- మండపం వద్ద నిరంతరం ఒక వాలంటరీ ఉండే విధంగా నిర్వహకులు ఏర్పాటు చేయాలి.
- అగ్ని ప్రమాదాల నివారణకు నీరు, ఇసుక అందుబాటులో ఉంచాలి.
- ఎలాంటి సందేహాలు ఉన్న పోలీస్‌లకు, లేదా 100కు డయల్ చేయాలి.

పోషణ్‌అభియాన్ కార్యక్రమ పోస్టర్ల విడుదల


పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 5: పోషణ్ అభియాన్ 2024 కార్యక్రమం పోస్టర్లను కలెక్టరేట్‌లో గురువారం కలెక్టర్ కుమార్ దీపక్ విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 30 వరకు పోషణ్ మాహ్ కార్యక్రమం జరుగుతుందని, పోషణ లోపాన్ని అధిగమించేందుకు అధికారులు సమన్వంతో చర్యలు చేపట్టాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా అందించే పౌష్టికాహారం వివరాలతో గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రదర్శనలు నిర్వహించాలన్నారు. ఆశా, ఆరోగ్య కార్యకర్తలు, అంగన్‌వాడీ టీచర్ల సమన్వయంతో గర్భిణీలు, బాలింతలకు, బాలికలకు రక్తహీనత శిబిరాలు నిర్వహించి అవసరమైన పరీక్షలు చేసి చికిత్సలు అందించేలా కృషి చేయాలన్నారు. అనంతరం అందరితో పోషణ్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. జిల్లా సంక్షేమాధికారి స్వరూప రాణి, డీఎంహెచ్‌వో హరీష్ రాజ్, జెడ్పీ సీఈవో గణపతి, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, సీడీపీవోలు విజయలక్ష్మీ, రేష్మ, రజిత, బుక్కా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

కాసిపేట, సెప్టెంబరు 5 : ఎమ్మెల్యే గడ్డం వినోద్ సమక్షంలో మండల బీఆర్ఎస్ నాయకులు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ వైస్ ఎంపీపీ పుస్కూరి విక్రమ్‌రావు, ఓరియంట్ సిమెంట్ కంపెనీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఏనుగు తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీటీసీలు అక్కెపల్లి సుమలత,శ్రీనివాస్, గొడిసెల భీమయ్య, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు వడ్లూరి మల్లేష్, వేణు, నాయకులు శ్యాంసింగ్, మల్లెత్తుల సందీప్, రాజేశ్వర్‌రెడ్డి, ప్రవీణ్, రాజు, సతీష్, లస్మయ్య, రవి, పోచం, ప్రశాంత్‌లతో పాటు 30 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. నాయకులు నర్సింగ్, సతీష్, నాయకులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మట్టి గణపతుల పంపిణీ

బెల్లంపల్లి, సెప్టెంబరు 5: జనహిత సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పట్టణంలోని కాంటా చౌరస్తాలో ఉచితంగా మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తామని సమితి అధ్యక్షుడు ఆడెపు సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతులను తీసుకువెళ్లి పూజలు చేయాలని కోరారు.

ప్రజలకు అవగాహన

భీమారం, సెప్టెంబరు 5: మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో గురువారం రాత్రి పోలీసు కళాబృందం సభ్యులు సైబర్ మోసాలు, షీటీం, బాల్య వివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏదైనా ఆపద ఉంటే డయల్ 100కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ రాములు, పోలీసులు పాల్గొన్నారు.

పరామర్శ


నివాళులర్పిస్తున్న చాడ వెంకట్‌రెడ్డి, నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 5: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కలవేని శంకర్ తండ్రి సమ్మయ్య అనారోగ్యంతో మృతి చెందగా జిల్లా నాయకులు పరామర్శించారు. జాతీయ ప్రధాన కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్, మేకల దాసు , బాపు, రాజేశ్వర్‌రావు తదితరులు శంకర్‌ను పరామర్శించారు. శంకర్ తండ్రి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలి

బెల్లంపల్లి, సెప్టెంబరు 5: బెల్లంపల్లి పట్టణంలో నిబంధనలు పాటించని వాటర్ ప్లాంట్లపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐయూ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందించారు. పట్టణ కార్యదర్శి ఆరేపల్లి రమేష్, పసులేటి వెంకటేష్‌లు మాట్లాడుతూ వాటర్ ప్లాంట్‌లు నిబంధనలు పాటించకుండ ధనార్జనే ధ్యేయంగా నడుస్తున్నాయన్నారు. నీటిలో కెమికల్స్ ఎక్కువ కలుపుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారన్నారు. అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే వాటర్ ప్లాంట్‌లను తనిఖీ చేసి నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సతీష్ తదితరులు పాల్గొన్నారు.

తెగని ప్రావిడెంట్ ఫండ్ లొల్లి

- ● చెల్లించాల్సిన బకాయిలు రూ.2 కోట్లు ● ఈఎస్ఐ బకాయిలు రూ.8లక్షలు


కాగజ్‌నగర్ మున్సిపాల్టీ ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు కార్మికులు(ఫైల్)

కాగజ్‌నగర్, సెప్టెంబరు 5: కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుల ప్రావిడెంట్ ఫండ్(పీఎఫ్) సమస్యఇంకా కొలిక్కిరాలేదు. పదిహేను రోజుల క్రితం మున్సిపల్ కాంట్రాక్టులు కార్మికుల ఈఎస్ఐ, పీఎఫ్ బకాయిలు చెల్లించాలని ఆందోళన బాట పట్టిన విషయం తెలిసిందే. వర్షాలు కురవటంతో పట్టణంలో పారిశుధ్య పనులు పడకేయటంతో వరంగల్ రీజినల్ డైరెక్టర్ మసూద్ కాగజ్‌నగర్‌కు చేరుకొని బకాయిలు విషయంపై విచారణ జరిపారు. జాప్యం ఎందుకు జరిగింది? ఎంత పెండింగ్ ఉన్నాయనే విషయంపై ఆరాతీసి మున్సిపల్ ఉన్నతాధికారులకు నివేదికను సమర్పించారు. ఈ నివేదికల్లో మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల బకాయిలు రూ.2.18 కోట్ల మేర ఉన్నట్టు తేల్చారు. ఇందులో పీఎఫ్ బకాయిలు రూ.2కోట్లు, ఈఎస్ఐ బకాయిలు రూ.18లక్షలు ఉన్నట్టు నిర్ధారించారు. పెండింగ్ బకాయిలు క్లియరెన్స్‌కునిధులు రావటంతో ఈఎస్ఐ బకాయిలు చెల్లించారు. ఇంకా రూ.8లక్షల మేర చెల్లించాల్సి ఉంది. కానీ పీఎఫ్ డబ్బులు రూ.2కోట్లు చెల్లించలేదు. 2019నుంచి 2024వరకు చెల్లించాల్సి ఉండగా, కొంత సమయం కావాలని పీఎఫ్ శాఖ అధికారులకు కాగజ్‌నగర్ మున్సిపల్ అధికారులు లేఖ రాశారు. మరో రెండు, మూడునెలల్లో ఈ బకాయిలు క్లియరెన్స్ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కాగజ్‌నగర్ మున్సిపాల్టీలో కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు 125మంది, వాటర్ సప్లయి, ఎలక్ట్రికల్ విభాగంలో 10మంది పనిచేస్తున్నారు. వీరికి మున్సిపాల్టీ నుంచి ఒక్కొక్కరికి ప్రతి నెల రూ.12,600జీతం ఇస్తుండగా ఇందులో ఈఎస్ఐ, పీఎఫ్ డబ్బులు రూ.1630కోత విధిస్తున్నారు. 160మంది కార్మికులకు నెలకు రూ2,60,800 కోత విధిస్తున్నారు. తమ జీతాల్లోంచి కోత విధించిన డబ్బులు ఇఎస్ఐ,పీఎఫ్ కార్పొరేషన్లకు ఎందుకు చెల్లించటం లేదని కాంట్రాక్టు కార్మికులు మండిపడుతున్నారు. ప్రస్తుతం ఈఎస్ఐ డబ్బులు చెల్లించటంతో కాంట్రాక్టు కార్మికులు వైద్యానికి అడ్డంకులు తొలగాయి. ఇక భవిష్యత్తు నిధి కోసం పూర్తిస్థాయి క్లియరెన్స్ చేస్తే తమ సమస్యలు తీరినట్టేనని కాంట్రాక్టు కార్మికులు పేర్కొంటున్నారు.

ఈఎస్ఐ డబ్బులు క్లియర్ చేశాం..

-అంజయ్య, మున్సిపల్ కమిషనర్



కాంట్రాక్టు కార్మికుల ఈఎస్ఐ డబ్బులు చెల్లించాం. ఇంకా రూ.8లక్షలు బకాయి ఉంది. అలాగే పీఎఫ్ డబ్బులు కూడా రూ.2కోట్లు బకాయి ఉంది. ఈ డబ్బులు కూడా క్లియరెన్స్ చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

సిర్పూర్(టి), ఆగస్టు 5: ఆదివాసీ మహిళపై అఘాయిత్యానికి పాల్పడిన వ్యక్తికి ఉరిశిక్ష వేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని విశ్రాంతిభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఆదివాసీ మహిళపై అఘాయిత్యం జరిగిన సంఘటన చాలా హేయమైనదన్నారు. బాధ్యుడిపై చట్టరీత్యా చర్యలు తీసుకుని శిక్షించాలన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంఘాల నాయకులు గోపాల్ పాల్గొన్నారు.

కౌటాల: ఆదివాసీ మహిళపై జరిగిన అఘాయిత్యం చాలా తీవ్రమైందని నిందితుడికి కఠినశిక్ష వేయాలని ఆదివాసీసంఘాల నాయకులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య, ఆదివాసీనాయకులు బాపు మాట్లాడుతూ మరోసారి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కట్టుదిట్టమైనచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో నాయకులు రాజు,గోపాల్,ప్రసాద్ ఉన్నారు.

ఇంటర్నెట్ సేవలు లేక ప్రజల ఇబ్బందులు

చింతలమానేపల్లి/దహెగాం, సెప్టెంబరు 5: మండలాల్లో బుధవారం రాత్రి నుంచి ఇంటర్నెట్ సేవలు లేకపోవడంతో వివిధ కార్యాలయాలు, బ్యాంకులు, మీసేవసెంటర్ల నిర్వహకులు, ప్రజలు ఇబ్బందులు పడ్డారు. నిత్యం నెట్ వాడకానికి అలవాటు పడిన ప్రజలు ఒక్కసారి నెట్‌సేవలు నిలిచి పోవడంతో ఇబ్బంది కరంగా మారింది. అధికారులు త్వరలోనే నెట్‌సేవలు పునరుద్ధరించాలని ప్రజలు కోరారు.

అనారోగ్యంతో మాజీ కౌన్సిలర్ మృతి

కాగజ్‌నగర్, సెప్టెంబరు 5: కాగజ్‌నగర్ మున్సిపల్ మాజీకౌన్సిలర్ తిలక్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. తిలక్ పదేళ్ల క్రితం కాగజ్‌నగర్ మున్సిపల్ కౌన్సిల్‌లో కౌన్సిలర్‌గా కొనసాగారు. తిలక్ మృతిపట్ల పాలకవర్గసభ్యులతోపాటు స్థానికనాయకులు ప్రగాఢసంతాపాన్ని ప్రకటించారు.

ఇద్దరికి 14రోజుల రిమాండ్

పెంచికలపేట, సెప్టెంబర్ 5: మండలంలోని మేరగూడ గ్రామానికి చెందిన ఇద్దరికి చుక్కల దుప్పిని వేటాడినకేసులో 14రోజుల రిమాండ్ విధించి ఆసిఫాబాద్ సబ్‌జైలుకు తరలించినట్లు ఎఫ్ఆర్వో అనీల్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపినవివరాల ప్రకారం.. ఈనెల3న చుక్కల దుప్పిని కుక్కలు గ్రామ సమీపంలోని పంట పొలాల్లోకి తరమడంతో దానిని పట్టుకుని వధించారు. ఈ కేసులో వీరిని అదుపులోకి విచారించగా వారు తప్పు ఒప్పుకోగా కేసును నమోదుచేసి గురువారం సిర్పూర్(టి) కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి వారికి 14రోజుల రిమాండ్ విధించినట్లు తెలిపారు. దీంట్లో మరికొంత మంది అనుమానితులు ఉన్నారని పూర్తిస్థాయిలో విచారణ జరిపి వారిని కూడా అదుపులోకి తీసుకుంటామని తెలిపారు.

కాగజ్‌నగర్‌ను కమ్మేస్తున్న ఎస్పీఎం పొగ

కాగజ్‌నగర్, సెప్టెంబరు 5: కాగజ్‌నగర్ పట్టణం ఎస్పీఎం పేపర్ మిల్లుపొగ కాగజ్‌నగర్ పట్టణాన్ని కమ్మేస్తోంది. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాల వల్ల ఎస్పీఎం పొగ పూర్తిగా మార్కెట్‌ఏరియా, ఎస్పీఎం పరిసర ప్రాంతాల కాలనీలను కమ్మేస్తోంది. ఈ పొగ భరించలేకుండా వాసన వస్తోందని పలువురు కాలనీవాసులు పేర్కొంటున్నారు. గాలిలో ఏర్పడే ఆర్ద్రత ప్రభావంతోనే ఈ సమస్య ఏర్పడుతుందని పలువురు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అంతా కోరుతున్నారు.


కాలనీల్లో కమ్మేస్తున్న ఎస్పీఎం పొగ

కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ ధర్నా



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

ఆసిఫాబాద్, సెప్టెంబరు 5: సివిల్‌సప్లయ్ హమాలీల కూలిరేట్లు పెంచాలని డిమాండ్ చేస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట ఏఐటీయూసీ నాయకులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ మాట్లాడుతూ గతప్రభుత్వం కుదిర్చిన ఒప్పందం ప్రకారం జనవరి 2024నుంచి సివిల్‌సప్లయ్ హమాలీ కార్మికుల కూలిరేట్లను పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం సివిల్‌సప్లయ్ డీఎం నర్సింహరావుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు దివాకర్, సుధాకర్, హమాలీ కార్మికులు పాల్గొన్నారు.

బెజ్జూరులో ట్రాఫికర్

- ● రోడ్డుపై వాహనాలతో రాకపోకలకు అంతరాయం
- ● ఇబ్బందులు పడుతున్న ప్రజలు


ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

బెజ్జూరు, సెప్టెంబరు 5: మండల కేంద్రంలో ట్రాఫిక్ పెరగడంతో తీవ్రఅసౌకర్యం కలుగుతోంది. వాహనాలు ఎదురెదురుగా వచ్చిన సమయంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా ప్రతి ఆదివారం మండలకేంద్రంలో వారసంత నిర్వహిస్తున్నందున సంతకు వివిధ గ్రామాలనుంచి క్రయవిక్రయదారులు వస్తుంటారు. ఈ క్రమంలో వ్యాపారులు సామగ్రి అమ్మకాలు జరిపేందుకు ప్రైవేటు వాహనాలైన ఆటోలు, జీపులు, ఇతర వాహనాలు వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. దీనికితోడు ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్లపైనే ఎక్కడపడితే అక్కడే నిలుపుతుండడంతో వచ్చిపోయే వాహనాలకు తీవ్రఆటంకం కలుగుతోంది. వారసంత కూడా ప్రధానరహదారిపై నిర్వహిస్తుండడంతో ట్రాఫిక్ సమస్య పెరుగుతోంది. అయినప్పటికీ అధికారులు ఎలాంటి చర్యలుతీసుకోవడంలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలకేంద్రానికి పదుల సంఖ్యలో ఆర్టీసీబస్సులు నడుస్తుంటాయి. ఈక్రమంలో బస్సువచ్చిన సమయంలో మరో వాహనం ఎదురుగా వస్తే ఇకఅంతే సంగతులు. కొన్నేళ్లుగా ఈసమస్య వెంటాడుతున్నా పూర్తిస్థాయిలో ట్రాఫిక్ నియంత్రణకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రధానరహదారి వెడల్పు చేపట్టినప్పటికీ ట్రాఫిక్‌సమస్య రోజురోజుకు పెరుగుతోంది.ఇకనైనా అధికారులు స్పందించి ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.


రోడ్డుపైనే నిలిపిన ద్విచక్ర వాహనాలు

కాగజ్‌నగర్‌లో జోరుగా పేకాట

- ● ప్రధాన రోడ్లకు ఆనుకుని అటవీప్రాంతాల్లో కేంద్రాలు

కాగజ్‌నగర్, సెప్టెంబరు 5: జిల్లాలో పేకాట జోరుగా సాగుతోంది. జిల్లాలో క్రాస్‌రోడ్డు సమీపంలోని కొండపల్లిలోని ఓ వ్యవసాయ క్షేత్రంతోపాటు కాగజ్‌నగర్‌లో, పలు మండలాల్లో పేకాట జోరుగా కొనసాగుతోంది. వీటితోపాటు జిల్లాలో ఉన్న పలు ఫంక్షన్ హాల్స్‌లో కూడా ఈదందా కొనసాగుతోంది. పోలీసులు తరచూ దాడులు చేస్తున్నా ఈ ఆటకు అడ్డుకట్ట పడడం లేదు. కాగజ్‌నగర్-సిర్పూరు(టి) మార్గంలో ప్రధానరోడ్డుకిరువైపులా అటవీప్రాంతం ఉంది. ఈ మార్గంలో వాహనాలు పక్కనపెట్టి అటవీప్రాంతంలోనే పేకాటదుకాణం పెట్టేస్తున్నారు. అలాగే సిర్పూరు(టి), కౌటాల, బెజ్జూరు ప్రాంతాల్లోని కొన్నిచోట్ల కూడా ఆడుతున్నారు. కాగజ్‌నగర్ మండలం భట్టుపల్లి సమీపంలో కూడా అడ్డపెట్టేసి పేకాటను ఆడేస్తున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఆటలు ఆడుతున్నారు. కాగజ్‌నగర్ పట్టణంలో మూడు కేంద్రాల్లో నిర్వాహకులు ఈ ఆటను నడిపిస్తున్నారు. కాగజ్‌నగర్ మండలంలోని అంకుసాపూర్, చారిగాం ప్రాంతాల్లో పట్టపగలే ఆడుతున్నారు. ఇప్పటివరకు కాగజ్‌నగర్ పరిధిలో పోలీసులు దాడులుచేసి, కేసులు నమోదు చేసి కోర్టుకు పంపించారు.

టాస్క్‌ఫోర్సు సిబ్బంది నిఘా పెడుతున్నా..

మంచిర్యాల, బెల్లంపల్లి, గోదావరిఖనికి చెందిన కొంతమంది పేకాటరాయుళ్లు వాహనాలపై వచ్చి కాగజ్‌నగర్-సిర్పూరు(టి)మార్గం, కాగజ్‌నగర్-పెంచికల్‌పేట వెళ్లే మార్గంలో వాహనాలను పక్కకు ఆపేసి అటవీప్రాంతంలో పేకాటను ఆడేస్తున్నారు. ఐదు నెలలక్రితం కూడా వీరిపై పోలీసులు దాడిచేసి అదుపులోకి తీసుకొని కేసులు కూడా నమోదు చేశారు. జిల్లాలో టాస్క్‌ఫోర్సు సిబ్బంది ఎప్పటికప్పుడు నిఘాపెట్టి దాడులు చేసినా పేకాటరాయుళ్ల ఆటను మానడం లేదు. కొద్దిరోజుల క్రితం కూడా కాగజ్‌నగర్‌లో ఓఇంట్లో పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని కేసునమోదు చేశారు. ఈ ప్రాంతంలో దాడులు నిత్యం జరుగుతుండటంతో మహారాష్ట్ర ప్రాంతంలోని చంద్రాపూర్, బల్లార్షా మూడు హోటల్స్‌లో యథేచ్ఛగా ఆడేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా పోలీసు అధికారులు దృష్టిసారించి పేకాటస్థావరాలపై దాడులు చేయాలని ఆయామండలాల వాసులు కోరుతున్నారు. ఈ విషయమై పట్టణ సీఐ శంకరయ్యను సంప్రదించగా, పేకాటఆడితే తమకు సమాచారం అందించాలన్నారు. తప్పకుండా కేసులు నమోదు చేస్తామన్నారు. ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు.

పోషణ్ అభియాన్ కార్యక్రమ పోస్టర్ల విడుదల
5లో..
మట్టి వినాయకులనే పూజిద్దాం...

ఎల్లంపల్లి ప్రారంభానికి సన్నాహాలు

- వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో నిర్మాణం
- పనులు పూర్తయినా ప్రారంభించని బీఆర్ఎస్ ప్రభుత్వం
- నెలాఖరులోగా సీఎం చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం


ఎల్లంపల్లి ప్రాజెక్టు

మంచిర్యాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లంపల్లి ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి సన్నాహాలు ప్రారంభమయ్యాయి. ప్రాజెక్టుకు శంకుస్థాపన జరిగి 20 సంవత్సరాల సుదీర్ఘకాలం తరువాత అధికారికంగా ప్రారంభోత్సవం జరగనుంది. 2004 జూలై 28న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రాజెక్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నత్తనడకన సాగిన పనుల కారణంగా మూడేళ్లల్లో పూర్తి కావలసిన నిర్మాణం 12 సంవత్సరాల సుదీర్ఘ కాలం పట్టింది. గోదావరి నదిపై ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించేందుకు అప్పటి ప్రభుత్వం 2004లో సుమారు రూ.6 వందల కోట్లు కేటాయించింది. 20.175 టీఎంసీల నీటి నిల్వ సామర్థ్యంతో నిర్మించిన ప్రాజెక్టు 30 వేల ఎకరాలకు సాగునీరు అందించేలా రూపకల్పన చేశారు. ఆనకట్ట నిర్మాణానికి రూ.408.85 కోట్లు కేటాయించగా గేట్ల నిర్మాణానికి సుమారు రూ.191 కోట్లు కేటాయించారు. మంచిర్యాల జిల్లా వైపు మట్టికట్ట పొడవు 2.10 కిలోమీటర్లు, కరీంనగర్ వైపున పొడవు 2.30 కిలోమీటర్ల మేర నిర్మించారు. ఆనకట్ట పొడవు 1.118 కిలోమీటర్లు కాగా 62 గేట్లు ఏర్పాటు చేశారు. మంచిర్యాల జిల్లాలో 7,385 ఎకరాలకు సాగునీరు అందించే విధంగా డీపీఆర్ తయారు చేశారు. హాజీపూర్ మండలంలో 7 గ్రామాలు, లక్షెట్టిపేట మండలంలో రెం డు గ్రామాలు ముంపునకు గురికాగా పునరావాస ఏర్పాట్లు చేశారు. ప్రాజెక్టు ఫుల్ రిజర్వాయర్ లెవల్ (ఎఫ్ఆర్ఎల్) 148 మీటర్లు కాగా క్రెస్ట్ లెవల్ 138 మీటర్లు, రోడ్డు బ్రిడ్జీ లెవల్ 152 మీటర్లతో నిర్మాణం పూర్తి చేసుకుంది.

సుదీర్ఘంగా సాగిన ఆనకట్ట నిర్మాణం

2004లో ప్రాజెక్టుకు శంకుస్థాపన జరుగగా కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ పనులు 2005లో పూర్తయ్యాయి. ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి సిమెంటేషన్ ఇండియా లిమిటెడ్ ముంబాయి సంస్థకు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం అగ్రిమెంట్ చేసింది. ప్రాజెక్ట్ 62 గేట్లు నిర్మించేందుకు పనులను రూ.191 కోట్లతో 25.11.2008న ఎస్ఇడబ్ల్యూ ఓం మెటల్స్(జేవీ) సంస్థకు అప్పగించారు. ఆనకట్ట నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పనులను అర్థాంతరంగా నిలిపి వేయడంతో ప్రాజెక్టు పనులకు ఆటంకం ఏర్పడింది. మిగులు పనులు రూ.116 కోట్లతో గేట్లు నిర్మించేందుకు ఎస్ఈడబ్ల్యూ సంస్థకు అప్పగించారు. పన్నెండేళ్ల సుదీర్ఘ కాలం తరువాత 2015లో ప్రాజెక్టు పనులు పూర్తయ్యాయి.

పూర్తి కాని పునరావాస పనులు

ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కింద జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతంలో 9 గ్రామాలను ముంపు ప్రాంతాలుగా గుర్తించారు. హాజీపూర్ మండలంలోని గుడిపేట, నంనూర్, చందనాపూర్, రాపల్లి, కొండపల్లి, కర్ణమామిడి, పడ్తనపల్లి గ్రామాలతో పాటు లక్షెట్టిపేట మండలంలోని గుళ్ళకోట, సూరారం గ్రామాలను ముంపు కింద ఎంపిక చేశారు. ఎఫ్ఆర్ఎల్ కింద హాజీపూర్ మండలంలోని రాపల్లి, కర్ణమామిడి, చందనాపూర్, కొండపల్లితోపాటు లక్షెట్టిపేట మండలంలోని గుళ్లకోటను ఎంపిక చేశారు. ప్రాజెక్టు నిర్మాణం పూర్తయినా నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాస కాలనీల ఏర్పాట్లు జరుగకపోవడంతో ప్రజలు ఆందోళనలకు దిగారు. దీంతో ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి ఆటంకాలు ఏర్పడుతూ వచ్చాయి.

పట్టించుకోని బీఆర్ఎస్ ప్రభుత్వం...

ప్రాజెక్టు నిర్మాణంతోపాటు నిర్వాసిత కాలనీల పనులు పూరయినప్పటికీ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభోత్సవానికి ముందుకు రాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించిన ప్రాజెక్టు కావడంతో పేరు ప్రఖ్యాతలు వారికి దక్కుతాయన్న ఉద్దేశ్యంతో ఆ విషయాన్ని పట్టించుకోలేదు. అయినప్పటికీ కాళేశ్వరం ప్రాజెక్టుల సముదాయ నిర్మాణం పూర్తికావడంతో ఎల్లంపల్లి ప్రాజెక్టును వాడుకోవడం ద్వారా ఇతర ప్రాంతాలకు నీటిని తరలించారు. అప్పట్లోనే ప్రాజెక్టు ప్రారంభోత్సవం మరోమారు తెరపైకి వచ్చినా ఆ దిశగా ప్రయత్నాలు జరుగలేదు. దీంతో ఇంతకాలం అనధికారికంగానే ప్రాజెక్టును వినియోగిస్తున్నారు.

మంత్రి హామీతో మళ్లీ తెరపైకి...

ఎల్లంపల్లి ప్రాజెక్టులో నీటి నిల్వలను పరిశీలించడానికి ఇటీవల వచ్చిన రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఈ నెలాఖరులో సీఎం చేతుల మీదుగా ప్రాజెక్టును అధికారికంగా ప్రారంభిస్తామని ప్రకటించారు. దీంతో ప్రాజెక్టు ప్రారంభోత్సవం మరోమారు తెరపైకి వచ్చింది. ప్రాజెక్టు ప్రారంభోత్సవంతోపాటు సమీపంలోని 70 ఎకరాలను కలుపుకొని పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని మంత్రి ప్రకటించారు. ఇది జరిగితే ప్రాజెక్టు రెండు జిల్లాలకు తల మానికంగా నిలవనుంది. మరోవైపు ప్రారంభోత్సవం జరిగితే ప్రాజెక్టుపై నుంచి పెద్దపల్లి జిల్లాకు నేరుగా రాకపోకలు అధికారికంగా సాగే అవకాశా లున్నాయి. దీంతో రెండు జిల్లా ప్రజలకు రవాణా సౌకర్యం మెరుగుపడనుంది.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి


మందులను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో

హాజీపూర్, సెప్టెంబరు 5: వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్‌వో హరీష్‌రాజ్ అన్నారు. గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ వైద్య సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. వైద్య శిబిరాలు నిర్వహించాలని, సమయపాలన పాటించాలని, అవసరమైన అన్ని మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల్లో మంచి ఫలితాలు సాధించాలని, తద్వారా జిల్లాను ముందంజలో ఉంచాలని కోరారు. వైద్యురాలు లహరి, డెమో వెంకటేశ్వర్లు, సీహెచ్‌వో జయమేరి, హెచ్ఈవో రఘుపతి పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను చేపట్టాలి



మాట్లాడుతున్న సీపీఎం నాయకులు

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 5: వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో పారిశుధ్యం లోపించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారని వెంటనే పారిశుధ్య పనులను నిర్వహించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్‌లు పేర్కొన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ వర్షాలు పడుతున్నందున వార్డుల్లో దోమల నివారణ మందులను స్ప్రే చేయాలని, ఫాగింగ్ చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. వైద్య శిబిరాలను నిర్వహించి జ్వరాలను నియంత్రించాలన్నారు. ఈ నెల 8 నుం చి 30 వరకు సీపీఎం మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మహేష్, రాజు, ప్రేంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

- దండేపల్లిలో ఏజెన్సీ బంద్
- కాసిపేటలో నిరసన
- జన్నారం, దండేపల్లిలో సీపీ పర్యటన


దండేపల్లిలో ఆదివాసి గిరిజన సంఘాల నాయకుల ర్యాలీ, దేవాపూర్‌లో నిరసన తెలుపుతున్న ఆదివాసీ సంఘాల నాయకులు

దండేపల్లి, సెప్టెంబరు 5: కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి చెందిన ఆదివాసి గిరిజన మహిళపై అత్యాచారయత్నం చేసిన దుండగుడిని కఠినంగా శిక్షించాలని మండల ఆదివాసి హక్కుల పోరాట సమితి తుడుందెబ్బ అధ్యక్షుడు కనక జంగు, గోండ్వాన పంచాయతీరాజ్ రాయి సెంటర్ మండల అధ్యక్షుడు పెంద్రం శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం ఏజెన్సీ బంద్ పిలుపులో భాగంగా ముత్యంపేట, దండేపల్లి, మ్యాదరిపేట, తాళ్ళపేట గ్రామాలోని వ్యాపార వాణిజ్య సంస్థలను మూసి వేయించారు. ఆదివాసిలు ర్యాలీ చేపట్టి నిందితుడిని ఉరి తీయాలని డిమాండ్ చేశారు. అనంతనం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కుడిమేత సోము, ఆడాయి కాంతరావు, భూమేష్, సెదం బాపు, కోమురం శంకర్, నరేందర్, పాల్గొన్నారు.

ఆదివాసి గిరిజనులు సంయమనం పాటించాలని సీఐ అల్లం నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్‌లు సూచించారు ఆదివాసి సంఘాలు బంద్‌కు పిలుపు నివ్వడంతో మండల కేంద్రంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. తాళ్ళపేట, మ్యాదరిపేట, దండేపల్లి, ముత్యంపేటలో బందోబస్తు నిర్వహించారు.

కాసిపేట: ఆదివాసీ గిరిజన మహిళపై అత్యాచారయత్నానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఆదివాసీ సంఘాల నాయకులు దేవాపూర్‌లో నిరసన తెలిపారు. ఆదివాసీ తుడుందెబ్బ రాష్ట్ర కార్యదర్శి ఆడె జంగు మాట్లాడుతూ నిందితుడికి మరణ శిక్ష విధించాలని, మహిళకు మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్ చేశారు. సీఐ శశిధర్‌రెడ్డి వారిని శాంతింపజేయడంతో ఆందోళన విరమించారు. నిందితున్ని శిక్షించాలని సీఐకి వినతి పత్రం అందించారు. పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, కొమ్ముల బాపు, సంద్ర భూమయ్య, కనకరాజు, పాల్గొన్నారు.

సమస్యాత్మక గ్రామాలను సందర్శించిన సీపీ

జన్నారం : ఆదివాసీ గిరిజన మహిళపై అత్యాచారయత్నం నేపథ్యంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా సమస్యాత్మక ప్రాంతాల్లో రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ పర్యటించారు. ఆదివాసీ గూడాలైన కవ్వాల్, లోతొర్రె, దేవునిగూడ, కిష్టాపూర్ గ్రామాలను సందర్శించి ప్రజలు, యువత, ఆదివాసీ నాయకులతో మాట్లాడారు. ప్రజలు సంయమనం పాటించాలని, ఏదైనా సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. ధర్నాలు, రాస్తారోకోలు చేస్తూ చట్టాన్ని చేతిలోకి తీసుకుని గొడవలు, అల్లర్లకు పాల్పడితే కేసులు నమోదు చేస్తామన్నారు. సోషల్ మీడియాలో వదంతులను వ్యాప్తి చేసే వారిపై, గ్రూపు అడ్మిన్‌లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అటవీ శాఖ గెస్ట్‌హౌజ్‌లో ఆదివాసీ సంఘాల నాయకులతో మాట్లాడారు. జైనూరులో గిరిజన మహిళపై అత్యాచారం చేసిన నిందితునికి ఉరిశిక్ష విధించి బాధితురాలికి న్యాయం చేయాలని, మెరుగైన వైద్యం అందించాలని ఆదివాసీ నాయకులు సీపీకి విన్నవించారు. నిందితున్ని అరెస్టు చేశామని, ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా మూడు నెలల్లో శిక్ష పడేలా చూస్తామని, బాధితురాలుకు ప్రభుత్వం తరుపున న్యాయం జరిగేలా కృషి చేస్తామని సీపీ హామీ ఇచ్చారు. ఆర్ఐలు సంపత్, వామనమూర్తి, ఎస్ఐ రాజ వర్ధన్, నాయకులు రాయిసిడం కాశీ, ధర్ము, గంగు పటేల్, రాజేష్, రాజ్‌కుమార్, అన్నావు, సుధాకర్ పాల్గొన్నారు.

దండేపల్లి: ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీపీ శ్రీనివాస్ అన్నారు. ఆదివాసి సంఘాల బంద్ నేపథ్యంలో మ్యాదరిపేటలో పోలీసు సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రజలు అపోహలు నమ్మవద్దని, సంయమనం పాటించాలన్నారు. సీఐ నరేందర్, ఎస్సై ఉదయ్‌కిరణ్ ఉన్నారు.


ఆదివాసీ నాయకులతో మాట్లాడుతున్న రామగుండం సీపీ శ్రీనివాస్

కలెక్టరేట్ ఎదుట నిరసన


కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న పార్ట్‌టైం ఉద్యోగులు

నస్పూర్, సెప్టెంబరు 5: జిల్లాలో సోషల్ వేల్ఫేర్ రెసిడెన్సీ స్కూల్స్‌లో పని చేస్తున్న పార్ట్‌టైం, గెస్ట్ ఫ్యాకల్టీ హిందీ-2, ఏసీటీ, పీఈటీ పీడీలు, వాచ్ మెన్‌లను తొలగించడాన్ని నిరసిస్తూ గురువారం కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్ కుమార్ దీపక్‌కు అందించారు. వారు మాట్లాడుతూ మూడు మాసాల నుంచి వేతనాలు రావడం లేదని, ఆకస్మికంగా తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యా సంవత్సరం మధ్యలో తొలగిస్తే తాము ఎక్కడికి వెళ్లాలన్నారు. తమ కుటుంబాల పరిస్థితి అగమ్యగోచరంగా మారాయన్నారు. తమ సమస్య పరిష్కరించి న్యాయం చేయాలని విన్నవించారు. రవి, తిరుపతి, స్రవంతి, మహేష్, జాడి మహేష్, కుమార్, బాపు, గణేష్, శ్రీనివాస్, సతీష్ పార్ట్‌టైం టీచర్స్, సిబ్బంది, పేరెంట్ కమిటీ పాల్గొన్నారు.

గురుకులాల మూసివేతకు ప్రభుత్వం కుట్ర



మాట్లాడుతున్న ఏఐఎఫ్‌డీఎస్ నాయకులు

బెల్లంపల్లి, సెప్టెంబరు 5: గురుకులాల మూసివేతకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని ఏఐఎఫ్‌డీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం బెల్లంపల్లిలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అకాడమిక్ మధ్యలో సాంఘిక సంక్షేమ కళాశాలల్లో పనిచేసే సబ్జెక్టు అసోసియేట్స్, పార్ట్‌టైమ్ అధ్యాపకులను తొలగిస్తూ ఈ నెల 3న ఉత్తర్వులు జారీ చేయడం అన్యాయమన్నారు. 250 మంది సబ్జెక్టు టీచర్లు, 4,500 మంది పార్ట్‌టైం అధ్యాపకులను తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. తొలగించిన వారందర్ని విధుల్లోకి తీసుకోవాలన్నారు. రాకేష్, నరేష్, మహేష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

అపూర్వ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చెన్నూరు, సెప్టెంబరు 5: చెన్నూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1970-71లో పదో తరగతి చదువుకున్న వారు గురువారం ఎస్ఎస్ఆర్ ఫంక్షన్‌హాలులో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఐదు దశాబ్దాల అనంతరం కలిసిన వారు ఉల్లాసంగా గడిపారు. అప్పటి గురువులు చంద్రయ్య, రామన్న, లచ్చయ్య, సయ్యద్ సాధిక్‌ఆలీలను సన్మానించారు. పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకొన్నారు. పురాణపు శంకర్, టంకసా రవీందర్, రుద్రబట్ల రాజారాం, రమేష్, పురుషోత్తం, శ్రీరాములు, రవీంద్ర నాథ్, కమలాకర్, సత్యనారాయణ, రాజేశ్వర్‌రెడ్డి, లింగయ్య పాల్గొన్నారు.

ఏరియా ఆసుపత్రిలో గోడలకు విద్యుత్ సరఫరా

బెల్లంపల్లి, సెప్టెంబరు 5: ఇటీవల కురుస్తున్న వర్షాలతో సింగరేణి ఏరియా ఆసుపత్రిలోని గోడలు తడవంతో గురువారం అత్యవసర విభాగం గది గోడలకు విద్యుత్ ప్రసారం జరిగింది. రోగి గోడను తాకడంతో షాక్ రావడంతో వైద్యులు, సిబ్బందికి తెలిపాడు. దీంతో అందులో ఉన్న రోగులను ఇతర గదిలోకి మార్చారు. ఇప్పటికైనా ఆసుపత్రిలో వైరింగ్ సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం

మందమర్రిరూరల్, సెప్టెంబరు 5: అంగన్‌వాడీ కేంద్రాల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందుతుందని ఎంపీడీవో రాజేశ్వర్ సూచించారు. గురువారం మామిడిగట్టులోని అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన పోషన్ అభియాన్ కార్యక్రమంలో మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం అందిస్తున్నామన్నారు. సూపర్ వైజర్ స్వప్న, ఏపీఎం లలితకుమారి, మౌనిక, లిప్సిక పాల్గొన్నారు.

భావితరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యం


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్, సన్మానం పొందిన ఉపాధ్యాయులతో కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, సెప్టెంబరు 5: విద్యార్థులను సన్మార్గంలో నడిపిస్తూ భావి తరాలను తీర్చిదిద్దడం ఉపాధ్యాయులకే సాధ్యమని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి పురస్కరించుకుని గురువారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సర్వేపల్లి జయంతి సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించడం చాలా సంతోషంగా ఉందన్నారు. గురువులు నేర్పిన పాఠాలు చాలా బలంగా ఉంటాయని తెలిపారు. అనేక మంది ఉన్నత స్థాయిలో నిలవడంలో ఉపాధ్యాయులు బోధించిన పాఠాలే మూలమని, ఉపాధ్యాయులు, పిల్లలు ఎక్కువ సమయం పాఠశాలల్లోనే గడుపుతారన్నారు. ఎంతో మంది మేధావులకు ఉపాధ్యాయులే ఆదర్శమన్నారు. 43 మంది ఉపాధ్యాయులను సన్మానించారు. విద్యార్థులు చేసిన నృత్యాలు అందర్ని అలరించాయి. డీఈవో యాదయ్య, జెడ్పీసీఈవో గణపతి, వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి నీరటి రాజేశ్వరి, అధికారులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి సర్వేపల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యాపకులు హరీష్‌కుమార్, గంగయ్య, కుమారస్వామి, గోపాలకృష్ణ, రాజయ్య, కనకలక్ష్మీ, కరుణాకర్, రాజు, అరుణ పాల్గొన్నారు. విజయం టీచర్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. సరిత, శిరీష్, శైలజ, వంశీకృష్ణ, పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గుడిరేవు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి విద్యార్థులు పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రధానోపాధ్యాయురాలు బొలిశెట్టి బుచ్చన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

కాసిపేట: పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలను బోధించారు. కాసిపేట పాఠశాల ఉపాధ్యాయుడు వేణు వద్ద చదువుకున్న విద్యార్థులు మండలంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తుండగా వారు వేణును సన్మానించారు. ఉపాధ్యాయులు శ్రీనివాస్, జ్యోతి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కన్నెపల్లి: మండలంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. జంగంపల్లి పాఠశాలలోని ఉపాధ్యాయులను లయన్స్‌క్లబ్ సభ్యులు సన్మానించారు.

భీమారం: అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. జిల్లా పరిషత్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విక్రమ్‌కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణ చిత్రపటానికి పూలమాలలు వేశారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు.

చెన్నూరు: కిష్టంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి పాఠాలను బోధించారు. ప్రిన్సిపాల్ చక్రపాణి, పట్వర్ధన్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కోటపల్లి: మండల కేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు ఉపాధ్యాయు లుగా పాఠాలు బోధించారు. బోధనలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

జన్నారం: ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడిగా అక్కపల్లిగూడ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గాజాల శ్రీనివాస్ ఎంపిక య్యాడు. హైద్రాబాద్ రవీంద్రభారతిలో మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీనివాస్‌ను సన్మానించి ప్రశంసా పత్రం అందించారు.

కాసిపేట: మల్కేపల్లి గిరిజన ఆశ్రమ బాలుర పాఠశాల ఉపాధ్యాయుడు అజ్మీర నర్సింహ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. ఉట్నూరులో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.


నర్సింహాను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

పొలాల పండుగలో మహిళల సందడి

కన్నెపల్లి, సెప్టెంబరు 5: మండల కేంద్రంలో పొలాల అమావాస్య పండుగను పురస్కరించుకుని గురువారం గురుగులు అంపులు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో వాగు వద్దకు చేరుకుని గురుగులు అంపారు. వాగులో గౌరమ్మను చేసి పూజలు చేశారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


వాగులో గురుగులు అంపుతున్న మహిళలు